# పాలు విరిగిపోయాయి!

"నాకు పెళ్ళే వద్దు బాబూ" అనే ఫేషన్ అలవాటు చేసుకుంది సుశీల.

అలా అన్నప్పుడు సర్వసంగ పరిత్యాగం చేసి నిర్లిప్తుడయిన ఋషిలాగ ముఖం పెట్టడం, ఈ పెళ్ళి అనే సాంఘిక దురన్యాయం మీద చెప్పలేని నైరాశ్యాన్ని, కళ్ళ చికిలింతలో ప్రదర్శించడం సుశీల అలవాటు చేసుకొంది.

గుర్రప్పందాలలో గెలవాలని తాపత్రయపడి చివరికి లక్షరూపాయలు గెలిచిన అపూర్వ క్షణంలో "ఆఁ, పోనిద్దూ - డబ్బంటే వ్యామోహం ఏనాడో చచ్చిపోయింది" అని నిర్లక్ష్యాన్ని చూపేవాడిని చూస్తే ఎంత జాలేస్తుంది? అదిగో, అలా మనస్సు కరిగిపోతుంది సుశీల అన్న మాటని వింటున్నప్పుడు.

ఎంచాతనంటే - పుట్టలు మరిచిపోయి కొండల్లో తచ్చాడుతున్న త్రాచుల్లాగ భుజాలమీంచి ముందుకు జారి రెపరెపలాడే రెండు జడల్నీ, అక్వేరియం వెనక ఆహారం కోసం అటూఇటూ వెదుక్కునే చేపల్లాగ గిలగిల్లాడే కళ్ళనీ, చిరునవ్వుకీ తిరస్కారానికీ మధ్య సందేహపు రేఖమీద నిలిచి పోయిన ఎర్రటి పెదాల్నీ, సినిమాల్లో, నాటకాల్లో కనిపించే త్యాగంలాగ ఉందా లేదా అనిపించే నడుమునీ, పాత జవానీకీ రైలువంటి నడుం మీద ఆధారపడిన ఆ శరీరాన్నీ చూసినప్పుడు ఇంత అందమయిన అమ్మాయి యింత త్వరగా "పెళ్ళి వద్దు" అనే కఠోర నిర్ణయానికి ఎలా వచ్చిందా అని కొంత దిగులు కలుగుతుంది.

అయితే "నాకు పెళ్ళేవద్దు బాబూ" అనే ఫేషన్‌నే అలవాటు చేసుకొంది సుశీల. అంతేకాని ఆ ఆలోచననీ ఆ భావాన్నీ అమలు జరపడం, ఆవిడ ఉద్దేశం కాదు.

ఎందుకంటే 'వొద్దు' అనే తిరస్కారంలో "కావాలి" అనే ఆకాంక్ష ఎక్కువగా ప్రతిఫలిస్తుందని ఆమె అనుభవం ద్వారా గ్రహించింది. లోకంలో "వద్దు" అనే వాళ్ళంతా "కావాలి" అనే దృష్టితోనే అంటున్నారనీ, సూటిగా చెప్పడానికి వయసో, వాతావరణమో, సంస్కారమో, మొహమాటమో అడ్డొస్తున్నదనీ ఆమె కనిపెట్టింది. నలుగురూ ఎబ్బెట్టుగానో సలక్షణంగానో చూసేదాన్ని నలుగురిలో కావాలని చెప్పడానికి సంస్కారి నేర్చుకున్నపదమే ఈ వద్దు అని ఆమె అర్థం చేసుకొన్నది.

సుశీల బామ్మ ఎప్పుడూ విరక్తిగా "నాకెంతమ్మా – పట్టెడు ఉప్పుపిండి అయితే రాత్రి గడిచిపోతుంది. నా కింకేమీ వొద్దు" అనడం వింది. ఆ రాత్రులు గడవడానికి దస్తా గిన్నెడు ఉప్పుపిండి ఫలహారం చెయ్యడమూ చూసింది.

"శనివారాలు భగవత్ప్రీతికి ఉపవాసం ఉండాలమ్మా, అందుకని రాత్రి భోజనం వద్దు, ఓ రొట్టెముక్క కొరికి దేవుడికి నమస్కారం చేశాను" అని తల్లి రుక్మిణమ్మ పక్కింటి వాళ్ళతో అనడం చాలాసార్లు వింది. కాని అరడజనుకి తక్కువ కాకుండా, డజనుకి మించకుండా రొట్టెలు ఫలహారం చేస్తేనే కాని ఆ శనివారాలు గడవని సందర్భాలెన్నో తెలుసు సుశీలకి.

"బ్రతికినన్నాళ్లూ నిజాయితీగా బ్రతకాలి. అంతేకాని లాలూచీలు చిన్నబుద్ధులూ మనికివొద్దు" అని పెద్ద తరహాగా తండ్రి గోవిందరావుగారు యింటికి వచ్చే క్లయింట్లతో తరచు అనడం వింది. అలా అన్నప్పుడు ఆయన ముఖంలో మోతీలాల్ నెహ్రూ, రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రి ప్రభృతుల ముఖాలలోని త్యాగనిరతి వెలగడం ఆమె చూచింది. కాని ఆయన ఏ క్లయింటు పంపిన అరటిగెలలూ కాదనలేదు, చెరుకుగడలూ, మామిడిపండ్లు, ఇస్త్రీ పెట్టెలూ, కొండొకచో వడ్లబస్తాలూ సరే సరి – అయితే అవన్నీ మామూళ్ళు.

క్లాసులో ముక్కు మాష్టరు తనవేపే చూస్తుండడాన్ని, రాధ స్నేహితురాళ్ళందరి దృష్టికి తెచ్చి "అబ్బ" అలా పొడిచేటట్టు నావేపే చూస్తుంటే వొంటిమీద తేళ్లూ జెర్రులూ పాకినట్లుంటుంది బాబూ, నాకీ పాఠమూ వొద్దు, ఈ క్లాసూ వద్దు అంటూండడం నిజమేనని నమ్మింది సుశీల. కాని ముక్కు మాష్టారూ రాధా ఓ సాయంకాలం లీలామహల్లో కనిపించాక ఆ వద్దు అని చెప్పడంలో స్వారస్యం అర్థమయింది. అంత అందంగా తన కోరికను క్యామొఫ్లేజ్ చేయగలిగినందుకు రాధని మనస్సులో అభినందించింది.

ఆ తర్వాత హిస్టరీ లెచ్చరర్ రామనాథం అంటే తనకు సుతరామూ కిట్టదని, బేథింగ్ సీన్లు ఉన్న సినిమాలంటె తనకి ఇష్టం లేదని, బారుల్లో బాల్‌రూం డాన్సులు ఎందుకు చేస్తారో తనకి అర్థంకాదని – నలుగురితోనూ వీలయినప్పుడల్లా అనడం ప్రారంభించింది. ఇదిగో ఈ సందర్భాలలో ఆమె చేసిన ప్రకటనే "నాకు పెళ్లే వద్దు బాబూ" అన్నది.

నిజానికి సుశీలకి, ఒకటి రెండు పెళ్ళి సంబంధాలూ వచ్చాయి. స్థితిగతులూ, ఆస్థిపాస్తులూ ఉన్న సంబంధాలే అవి. కానయితే వాళ్ళు సుశీలను గురించి వాకబు

చేసినప్పుడు ఆమె ధోరణిని కర్ణాకర్ణిగా విన్నవాళ్ళు "అదేమిటి! ఆ అమ్మాయి పెళ్ళివద్దు మొర్రో అంటూంటే మీరు చేసుకొంటాననంటారేమిటి?" అని విస్తుపోవడంతో పెళ్ళివారూ విభ్రాంతులు కాడం 'అంత చేసుకోననడానికి ఆ అమ్మాయికి ఏం అభ్యంతరాలో? అవన్నీ తల్లిదండ్రులకి తెలియాలని మాత్రం ఏముంది?" అని ఆ ప్రయత్నాలు అంతటితో మానుకొన్నారు. ఈ విషయం సుశీలకు తెలీదు, వాళ్ళ నాన్నగారికీ తెలీదు.

ఓసారి ఓ అందమయిన కుర్రాణ్ణి పెళ్ళిచూపులకి తీసుకొచ్చారు నాన్నగారు. పేరు కృష్ణారావు. కుర్రాడు పొట్టిగా, నిండుగా బాగున్నాడు. బుగ్గలు ఉబ్బినట్టుండి, లోపల పెద్ద సైజు కిళ్ళీలు పెట్టినట్టుంటాయి. ముభావంగా ఉన్నప్పుడు నవ్వినట్టు, నవ్వినప్పుడు ముభావంగా ఉన్నట్టూ కనిపిస్తాడు. అయినా తీవిగానే ఉన్నాడు. తీవిగా ముభావంగా ఉన్నవాళ్ళంటే సుశీలకి సరదా – వాళ్ళ హిస్టరీ మాస్టరు అలాగే ఉంటాడు కనక. అందుకని, ఈ కుర్రాణ్ణి చేసుకోవాలనే అనిపించింది. పెళ్ళిపెద్దలు పనిగట్టుకొని సూటిగా "చెట్టులెక్కగలవా? పుట్టలెక్కగలవా?" అని ప్రశ్నలు వేస్తూంటే బియ్యే మూడోసారి పరీక్ష రాసినప్పటంత శ్రద్ధగా జవాబులు చెప్పింది. తీవిగా ఉన్న పెళ్లికొడుకు ముఖం ముభావంగా అయింది. అంటే అతను నవ్వు నవ్వుతున్నాడని అర్థం చేసుకొంది.

పెళ్ళివారు వెళ్ళిపోయాక అమ్మమ్మా, నాన్నగారూ, బామ్మా ఓ చిన్న సమావేశం జరిపారు. పెళ్ళిపెద్దలకివ్వగా మిగిలిన ఉప్మా అంతా తిని కాఫీలు త్రాగి చీకటిపడేవరకూ చర్చలు జరిపారు. జరిపి జరిపి ఆహార సమస్యా నివారణకు సత్వర చర్యలను విచారించిన ముఖ్యమంత్రుల సమావేశంలాగ ఎక్కడి వాళ్ళక్కడ చెదిరిపోయారు.

రాత్రి వెన్నెట్లో పడుకొని పొట్టిగా, తీవిగా ఉన్న పెళ్ళి కొడుకు గురించి, భవిష్యత్తులో ఎప్పుడన్నా "ఏమండీ, సినిమాకు వెళదామండీ" అంటే తీసుకువెళ్తాడా లేదా అన్న సమస్యను గురించీ ఆలోచిస్తూ పడుకొని ఉండగా, అమ్మ మంచం దగ్గరికి వచ్చి కూర్చుని "అవునే బుచ్చీ? అబ్బాయి యెలా ఉన్నాడే? సిగ్గు పడకుండా చెప్పు" అంది తనింకా సిగ్గుపడకముందే.

అప్పుడింక వెన్నెట్లోనే సిగ్గుతో వెయ్యివంకరలు పోయి, అటు నుంచి ఇటుతిరిగి "అబ్బ! నాకు పెళ్లేమిటమ్మా!" అంది తల్లి ఒడిలో తలదాచుకొంటూ. కుటుంబంలోని ఆనవాయితీ ప్రకారం నాకు నచ్చాడని చెప్పడానికి ఇదే పద్ధతనుకొంది సుశీల.

కాని "పాపం! పిచ్చిది. ఈసారీ అబ్బాయి నచ్చలేదు కాబోలు. నచ్చకపోవడానికి దానికేం కారణాలు కనిపించాయో" అని తల్లి రుక్మిణమ్మ అనుకొంది.

ఏమయినా కూతురుకి ఇష్టంలేని పని చెయ్యదలుచుకోలేదు పెద్దవాళ్లు. అందుకని ఆ సంబంధమూ పోయింది. ఎందుకు పోయిందో తెలుసుకునే ధైర్యం కాని, అది పోకుండా ఉండడానికి ఏం చెయ్యాలనే ఆలోచనగాని చెయ్యలేక పోయింది సుశీల.

నెలరోజుల తర్వాత రాధ నలందా రూఫ్ గార్డెన్ హోటల్‌లో కనిపించి "అవునోయ్,

బచ్చల బుచ్చిసుందర్రావుగారి అబ్బాయి ఆ రోజు ఠీవిగా, ముభావంగా ఉన్న కృష్ణారావేనని తెల్సుకొన్నాక, "నేను వద్దనలేదే" అని ఆశ్చర్యపోయింది సుశీల.

"ఏమోనోయ్, నాకు ఖాయం చేశారు మా వాళ్ళు. వద్దనడంలాంటి పనులు నా కిష్టం ఉండదు" అని రాధ నవ్వేసింది. తర్వాత ఆ మాటా ఈమాటా మాట్లాడుతూ "ఏం? నీకు పెళ్ళి చేసుకోవాలని లేదా?" అనడిగింది.

"ఆఁ నాకు పెళ్లేవద్దు బాబూ?" అంది సుశీల ఠీవిగా, ముభావంగా.

ఆ మాటల్లో "ఆఁ! పెళ్లెవరికక్కర్లేదే!" అనే ఆశ, "కావాలి" అనే కోరికా కనిపించాయి.

* * * * *

"పెళ్ళా? అమ్మో ... వద్దుబాబూ!" అనడం ఫేషన్‌గా అలవాటు చేసుకొంది సుశీల, మూడేళ్ల తర్వాత.

పెళ్లన్నది ఓ చీకటి కోణం అయినట్టూ దానికి తలవొంచడం, దీపం లేకుండా ఆ చీకటిలోకి వెళ్ళడమన్నట్టూ గతుక్కుమనేది.

ఈ మధ్యలో ఒకటి రెండు సంబంధాలు రావడం, అవి మధ్యలోనే జారిపోతూ ఉండడం జరిగిపోయాయి. అలా జరిగినప్పుడల్లా సుశీల బామ్మ నోరు చప్పరించి, "ఆఁ! పండంటి పిల్లకి పెళ్లి జరక్కపోతుందా? ఈ సంబంధం కాకపోతే మరొకటి? ఇంతకీ దానికెక్కడ రాసిపెట్టి ఉందో అక్కడే అవుతుంది. ఆ మొగుడెవరో ఎక్కడో పుట్టే ఉంటాడు" అంటూండేది.

ఈ ఫిలాసఫీ ఎంతో నచ్చింది సుశీలకి. ఆ రాసిపెట్టి ఉన్నవాడు గోపాలరావనే చిన్నవారా "పోరంకి" వెళుతున్న బస్సులో సంవత్సరం క్రితమే తటస్థపడ్డాడని, అతనితో నాలుగు సార్లు కృష్ణా బ్యారేజీకీ, పదిసార్లు సినిమాకీ, ప్రతీ రోజూ సాయంకాలం హోటళ్ళకీ వెళుతున్నామని వాళ్లకి తెలీదుకదా అని సుశీల వాళ్ల అజ్ఞానానికి మనస్సులో జాలిపడింది.

ఎదుటివాళ్లకి తెలియని విషయం మనకి తెలియడంలో ఎంత గర్వంఉందో ఇన్నాళ్లకి గ్రహించింది. కాని గోపాలరావుకూడా అదే గర్వాన్ని, సుశీలని ప్రేమించకుండా ప్రేమిస్తున్నానీ భ్రమింపచేస్తున్నాడనే గర్వాన్ని, సంవత్సరం నుంచీ అనుభవిస్తున్నాడని సుశీలకు తెలియలేదు.

అయితే వాళ్ళిద్దరూ చాలా సాయంకాలాలు సినిమాడైలాగాలు మాట్లాడుకొన్నారు. ఈ గ్రుడ్డి సంఘం తమని ఇంకా గుర్తించే రోజు రాలేదని ఇద్దరూ కూడబలుక్కొన్నారు.

"నన్ను ఎంతగా ప్రేమిస్తున్నావు గోపీ!" అని అతని ఊపిరి బుగ్గలకి తగిలేటంత దగ్గరగా ఉన్న సందర్భాలలో సుశీల అడిగితే –

మాటల మధ్య గాలిని వదుల్తూ "నేను మాటల్తో చెప్పలేను సుశీ. ఈ ఆకాశం, ఎండలూ, మర్రిచెట్టూ, మరకత వల్లీ నర్సింగ్‌హోమ్ సాక్షిగా నిన్ను ప్రేమిస్తున్నాను" – అని

గోపాలరావు అనేవాడు – ఆక్షణంలో అతని దృష్టి ఆనిన వస్తుసంపదని డైలాగుల్లో చేరుస్తూ.

ప్రేమించుకున్నవాళ్లు లాంఛనంగా ఒక రిక్షాలో వెళ్లాలని తెలిసి వాళ్లిద్దరూ సినిమా నుంచి చాలాసార్లు అలా చేశారు. అప్పుడు సుశీలకి తెలిసిన వాళ్లు కూడా చూడటం జరిగింది. సుశీల తన ఫోటో ఒకటి అతనికిచ్చింది. గోపాల్ ఫుట్‌బాల్ చాంపియన్‌గా బనీనుతో తీయించుకున్న ఫోటో ఆమెకి బహూకరించాడు. ఇలా వారి ప్రేమ మూడు పువ్వులూ ఆరు కాయలూ అయింది.

ఈకారణంగా – సుశీల బామ్మ "వాడెక్కడో పుట్టే ఉంటాడు" అన్నప్పుడల్లా.

"ఎక్కడో కాదు బామ్మా, నిడదవోలు సమీపాన పందలపర్రు గ్రామంలో పుట్టి, ఇప్పుడు సూర్యారావుపేటలోనే పెరుగుతున్నాడు" అని చెప్పాలని నోటివరకు వచ్చి అంతలో ఆగిపోయేది.

ఈ కారణంగానే వచ్చిన ఒకటి రెండు సంబంధాలపైనా సుశీల అభిప్రాయాన్ని రుక్మిణమ్మ అడిగినప్పుడు "పెళ్ళా? అమ్మో – నాకు వద్దు బాబూ!" అని సమాధానం చెప్పింది– లైటులేని రిక్షావాలా పోలీస్ స్టేషన్ ముందునుంచి వెళ్లడానికి భయపడినట్టు.

ఇలా ఉండగా కాలేజీ పరీక్షలు అయిపోయాయి. శలవు లిచ్చారు. పరీక్షలయిన కుర్రాళ్ళంతా ఇళ్లకి వెళ్ళిపోవాలి గనుక, గోపాలరావూ యింటికి బయలుదేరాడు. దిగులు కళ్ళతో, బరువెక్కిన హృదయంతో వీడ్కోలు యిచ్చింది సుశీల. తన దుఃఖాన్ని బహిరంగంగా అనుభవించే అవకాశాన్ని ఈ సంఘం కల్పించనందుకు సంఘాన్ని నిందించి, మూగబాధని అనుభవిస్తూ కొన్ని రాత్రులు భోజనం చెయ్యడం మానేసింది.

కాని ఎన్నాళ్ళయినా గోపాలరావు దగ్గర్నుంచి ఉత్తరం లేదు. వచ్చేజాడలేదు. తల్లిదండ్రుల్ని ఒప్పించి పెళ్లి చేసుకొంటానన్న మాటనికూడా సుశీలతోపాటు విజయవాడలోనే వదిలేసి గోపాలరావు రైలెక్కిపోయాడు.

ఒక శుభ సమయాన పసుపు రాసిన దళసరి కవరుని పోస్టు బంట్రోతు నడవలోకి గిరవాటెట్టి వెళ్ళిపోయాడు. తీసి చదువుకొంది సుశీల. గోపాలరావుకీ చిరంజీవి సౌభాగ్యవతి వెంకుమాంబకీ పెళ్లని. వెంకుమాంబ ఎవరనికాదుగానీ, తను కానందుకు దుఃఖము ముంచుకు రాగా మరికొన్ని రాత్రులూ, పవళ్లూ రహస్యంగా ఏడ్చింది సుశీల.

ఆలోచనలూ, దుఃఖమూ పాతబడ్డాక అప్పుడప్పుడు వారపత్రికలూ, అవీ చదవడం అలవాటు చేసుకొంది. సాయంకాలాలు అలా షికారుగా నడిచి వచ్చేది.

"వాడెక్కడో పుట్టే ఉంటాడు" అనే బామ్మ మాటల్ని ఆసక్తితో వినేది.

ఒక రోజున సినీమా నుంచి వస్తూండగా రాధ భర్తతో ఎదురయి పలకరించింది. సన్నంగా పొడుగ్గా ఉండే రాధ బొద్దుగా అందంగా తయారయింది. ఆమాటా ఈమాటా అయ్యాక "అయితే ఏమోయ్! నీ పెళ్లి మాటేం చేశావ్?" అంది రాధ మాట మధ్యలో.

సుశీల నవ్వి "పెళ్లా! అమ్మో – నాకు వద్దు బాబూ" అంది.

ఆ మాటలో "త్వరగా జరుగుతుందంటావా?" అనే ప్రశ్న, "జరిగితే బాగుణ్ణు" అన్న ఆత్రుతా వినిపించింది.

* * * * *

"నా పెళ్ళా! సరేలే –" అనడం ఫేషన్‌గా చేసుకొంది సుశీల – ఈ రెండేళ్ళయి.

ఈ రెండేళ్ళలో తన కోరికలకి రూపం ఇవ్వగల ఇద్దరు సన్నిహితులూ పోయారు – బామ్మ, అమ్మ. ఒకావిడ వయస్సు మీరడంవల్లా, మరొక ఆవిడ మనస్సు మారడంవల్లా పోయారు. రుక్మిణమ్మగారు గుండె జబ్బువలన పోయిందని డాక్టర్లు తేల్చారు. సుశీల పెళ్లిగురించి బెంగవల్లనని బామ్మ బ్రతికుంటే చెప్పేది. కాని ఆవిడ ముందే పోయింది. తను ప్రేమించిన గోపాలం దూరం కావడంతోనే బాధపడుతున్న సుశీలకి, తనని ప్రేమించే బామ్మ, అమ్మ పోవడం కొత్తగా కనిపించింది. ప్రేమ, అందం, ఆనందం ఒంటరితనంలో చచ్చిపోతాయి. ఆనందం ఇద్దరి ఆలోచనల మధ్య వికసిస్తుంది. అందం ఎదుటి వ్యక్తి హర్షంలో ప్రసుఫుటమవుతుంది. మరి ప్రేమా అంతే –

వెన్నెట్లో పడుకొన్నప్పుడు దాని అందం తెలీదు. వెన్నెల లేని రాత్రి చీకటి ఆకాశం క్రింద పడుకొన్నప్పుడు వెన్నెల రాత్రి ఆనందం అర్ధమవుతుంది. తల నిమిరి ఆనందంగా పలకరించే అమ్మ గొంతులో తియ్యదనం, "వాడెక్కడో పుట్టే ఉంటాడు" అని తన ఒంటరితనాన్ని మరిపించే బామ్మ బుజ్జగింపూ ఇప్పుడర్ధమయాయి. కాని యిప్పుడవి కరువయ్యాయి. సుశీల పెళ్లి కావాలని ఆ యింట్లో శతపోరి, ప్రతిరోజూ గుర్తు చేసే వాళ్లిద్దరూ కన్నుమూశారు. ఈ నష్టాన్ని నలభైఏళ్ల తండ్రి భర్తీ చెయ్యలేదు. పన్నెండేళ్ళ చెల్లెలు శాంత అంతకన్నా భర్తీ చెయ్యలేదు. ఎగిరేబెలూను గాలిలో తాప్పున పేలితే నవ్వాలనీ, గాలి శరీరాన్ని కరచుకొని గిలిగింతలు పెడితే అందంగా ఉంటుందనీ, హొటల్లో అందరూ చూస్తుండగా కాఫీ త్రాగడం ఫేషన్ అనీ శాంతకి ఇప్పుడిప్పుడే అర్ధమవుతోంది. శాంత ఆలోచనలు ఇప్పుడిప్పుడే ఆశలవుతున్నాయి. సుశీల ఆశలు అప్పుడే ఆశయాలయ్యాయి.

ఎప్పుడూ చూడని దూరపు బంధువులు ఇప్పుడు తరచూ వచ్చిపోతున్నారు. ఎవరో విధవావిడ – ఓ ఉదయం వచ్చి పిల్లలిద్దర్నీ దగ్గరికి తీసుకొని "ఈ పిల్లల్ని పెట్టుకొని ఒక్కడివీ ఎలా బ్రతుకుతున్నావు అన్నయ్యా!" అని రాగం పెట్టింది. ఇన్నాళ్లూ మాత్రం ఎలా బ్రతికారో ఈవిడికి తెలుసా అని సుశీల ఆశ్చర్యపోయింది. ఈవిడ ఎప్పుడు తను అన్నయ్య అయాడో తెలీక గోవిందరావుగారూ కాసేపు నిర్ఘాంతపోయారు. అయితే కష్టకాలంలో మంచిమాటు చెప్పేవాళ్ళంతా బంధువులుగానే కనిపిస్తారు. ఈ రహస్యాన్ని కనిపెట్టే బంధువులుకాని వాళ్లంతా మంచిమాటలు చెప్పి ఆ క్షణం నుంచీ బంధువులయిపోయారు.

ఇప్పుడు వంటమనిషి పనిమానేసింది. విధవావిడే వంట చేస్తోంది. ఆవిడ పింతల్లి కొడుకూ, తమ్ముడి పిల్లలిద్దరూ ఇంటిలో చేరిపోయారు. ఆరునెలలయేసరికి ఇల్లు రైల్వే ప్లాటుఫారంలా తయారయింది.

ఓరోజు సుశీల స్టిచింగ్ క్లాసునుంచి ఇంటికి వచ్చేసరికి ఎవరో పెళ్లివారు ఇంట్లోకి వచ్చి కూచున్నారు. వాళ్లో పెళ్లిసంబంధానికి వచ్చారని చూడగా గ్రహించింది. ఈసారి పెళ్లికొడుకు ఎలాంటి వాడయినా తప్పక ఒప్పుకోవాలనుకొంది. ఈసారి "అబ్బ పెళ్లేమిటి లెద్దూ!" అనకూడదు. చిరునవ్వునవ్వి తలాడించాలి.

పెళ్లివారు వెళ్లిపోయారు. వాళ్లెవ్వరో, ఎక్కణ్ణుంచి వచ్చారో బామ్మ బ్రతికుంటే చెప్పేది. ఎప్పుడూ నాన్నగారిని యిలాంటివి అడిగే అలవాటులేదు. వాళ్లు ఎప్పుడో వస్తారని, వచ్చినప్పుడు వరుడూతనని చూడడానికి వస్తాడని రోజు ముస్తాబయి – ఆశగా చూసేది.

ఒకరోజు పెళ్లివారు వచ్చారు. వాళ్లందరిలోనూ పెళ్లికొడుకు ఎక్కడా అని వెదికింది. కాని అంతా నలభై పైబడినవాళ్లే. నిర్ఘాంత పోయింది. శాంతని రహస్యంగా పిలిచి "ఎవరే వాళ్లు?" అంది.

"పెళ్లి వారక్కా – చూపులకి వచ్చారు."

"ఎవరి పెళ్ళి!"

"ఇంకెవరికి? నాన్నగారికి" అదేదో సామాన్యమయిన విషయంలాగ – ఎలకల విషం వేస్తే ఎలకలు చావకేం చేస్తాయి? అన్నంత సామాన్యంగా చెప్పేసి వెళ్ళిపోయింది శాంత. దిమ్మరపోయింది సుశీల. పెళ్ళినాన్నగారికా? అందుకా యిన్నాళ్ళూ రాకపోకలు?

పాపం! సుశీల పెళ్లిని గురించి ఆలోచించింది కాని, చేసుకోవాలనే మనుషుల గురించి ఆలోచించలేదు. మామిడిపండు తియ్యగా ఉంటుందని తెలుసుకాని, దానికి కారణమయిన మామిడి చెట్టు సంగతి తెలీదు.

హఠాత్తుగా పెళ్లి సమస్య సుశీల మీదనుంచి గోవిందరావుగారి మీదకి బదిలీ అయిపోయింది. ఇప్పుడెవరూ "ఆ అమ్మాయికి పెళ్ళికాలేదేం?" అనుకోవడంలేదు. కాని అందరూ గోవిందరావుగారికి ఇంకా పెళ్ళికానందుకు తెగ బాధపడి పోతున్నారు. సుశీల పెళ్ళికి వయస్సు మించిపోతుందని ఎవరూ అనడంలేదు. కాని నాన్నగారికి వయస్సుకి పెళ్ళి మించి పోతోందని ఆరాటపడుతున్నారు. పెళ్లి కావలసిన సుశీల ఆ ఆవిషయం మరిచిపోయింది. కాని పెళ్ళి చెయ్యవలసిన తండ్రి కూతురు పెళ్ళి విషయం మరచిపోయి తన పెండ్లిని గురించి ఆలోచిస్తున్నాడు. ఓ శుభముహూర్తాన "ఆఁ – నాకు పెళ్లేమిటిలే – అందులోనూ ఈ వయస్సులో" అంటూనే ఆయన పీటలెక్కాడు.

పెళ్ళి నాలుగు రోజులూ ముచ్చటగా జరిగింది. వధూవరులచేత బంతులాట లాడించారు. సదస్యసంభావనలు ఒకటికి రెండింతలిచ్చారు.

పెళ్లికివచ్చిన ముత్తయిదువలలో ఒకావిడ హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినట్టు – సుశీల వేపు తిరిగి "అవునే అమ్మడూ మరి నీ పెళ్లెప్పుడూ!" అంది.

సుశీల నవ్వేస్తూ "నా పెళ్లా? సరేలే అత్తయ్యా" అంది.

"నా పెళ్లా? – ఇప్పటికయినా జరిగితే అదృష్టవంతురాలినే" అన్న పిచ్చి ఆశ,

"జరుగుతుందా" అన్న బలహీనపు అనుమానం ఆ మాటలలో ప్రతిఫలించింది.

* * * * *

"ఆఁ, నా పెండ్లికేం పోనిస్తూ" – అనడం తప్పనిసరిగా – ఇష్టం లేకపోయినా – ఇప్పుడు ఫేషన్ చేసుకొంది సుశీల.

"అలా అనడం నాకో ఫేషన్ అయిపోయింది" అని యివాళ – అంటే ఈ ముప్పయి రెండోయేట – మరోవాక్యం కూడా చేరుస్తుంది సుశీల.

ఇప్పుడు సుశీల పాలసప్లయి ఆఫీసులో రెండువందల రూపాయల గుమాస్తా. ఎప్పుడయినా పాలు విరిగిపోతే, ఎందుకు విరిగిపోయాయో, విరిగిపోయిన పాలు ఏం చేస్తున్నారో తణికీ చేసే ఉద్యోగం సుశీలది. తనకా ఉద్యోగం సరిపోతుందని ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసరే అన్నాడు. "అవునుసార్ – విరిగిపోయిన జీవితం నాది. కరిగిపోయిన యౌవ్వనం ఏమవుతుందో నాకు తెలుసు. విరిగిపోయిన పాలు రసగుల్లాలవుతాయి. విరిగిపోయిన యౌవ్వనం ఏమీకాదు" అని మనస్సులో అనుకొంది. అనుకొని నవ్వుకొంది.

గోవిందరావుగారికిప్పుడు ప్రాక్టీసు తగ్గింది. "అయినా నాకున్న ప్రాక్టీసు నాకు చాలు. నాకు లేనిదీ, సాధ్యం కానిదీ నాకు వద్దు" అనడం నేర్చుకున్నారాయన ఆనవాయితీగా. కానీ సాధ్యం కాకపోవడానికి కారణం, ఇప్పుడు ఆయన దృష్టి 24 గంటలూ ఇంటిమీదే ఉండడం, ప్రాక్టీసు లేకపోవడానికి కారణం పార్టీలు రాకపోవడం. పెళ్లాం పోయినప్పుడు గోవిందరావుగారి ఒంటరితనానికి సానుభూతి చూపిన పార్టీలు, ఆయన రెండో పెళ్ళిని హర్షించలేకపోయారు. ఇంట్లో చెట్టంత పిల్లని పెళ్లికి ఉంచుకొని తాను పెళ్లి చేసుకొని కులుకుతున్నాడు" అన్నారు. అలా తాము చేయలేని ముసిలి క్లయింటులు కొందరు కొత్త ప్లీడర్ల దగ్గరికి పోయారు.

సుశీలకి గోవిందరావుగారు ఆ మధ్య కొన్ని సంబంధాలు వెదికారు. కాని వొక్కటీ కలిసిరాలేదు. దానికి కారణాలు వేరే చెప్పనవసరం లేదు. ఇప్పుడిక ఏ రోజయినా పెళ్లివారు రావచ్చుననీ, తాము ముస్తాబవడం మంచిదనీ సుశీల అనుకోవడం లేదు. "వాడెక్కడో పుట్టేవుంటా" డన్న బామ్మ మాటలూ గుర్తు చేసుకోవడం లేదు.

కొత్తగా వచ్చిన యజమానురాలు సుశీలకన్న రెండేళ్లు పెద్ద. ఆవిడ పేరు అలివేలు. పెద్దయింటి కోడలు అవడంచేతా, పెద్దవాడిని కట్టుకోవడం చేతా ఆవిడకి పెద్ద బుద్దులు సహజంగా వచ్చేశాయి. తనంత ఉన్న పిల్లల్ని అసహ్యించుకోవడం – కనీసం అలాకనిపించడం మంచిది కాదనీ, అది తనకే శ్రేయస్కరం కాదనీ, ఆమె వచ్చిన నెల రోజుల్లోనే గ్రహించింది. అందువల్ల సుశీల, శాంత అంటే రెండు కళ్లలాగ చూసుకోవడం ప్రారంభించింది. కాఫీ ఇచ్చే వేళలో హార్లిక్స్ ఇచ్చింది. హార్లిక్స్ ఇచ్చే వేళలో పళ్లరసం ఇచ్చింది. తత్ఫలితంగా ఇంటి ఖర్చు పెరిగితే పెరిగాయి కాని అందరి అభిమానమూ ఆమెకి దక్కాయి.

ఆమె కూడా కుటుంబ సాంప్రదాయం ప్రకారం – "నాకేముందమ్మా బీదకుటుంబం నుంచి వచ్చాను. మీ మధ్య ఉంటూ రోజులు గడుపుకొని ఆయన ముందే సుమంగళిగా వెళ్లిపోతాను. నాకేమీ వద్దు" – అని చెప్పడం అలవాటు చేసుకొంది.

ఆమె ఆ ఇంటి భవిష్యత్తుని అతిసులువుగా బేరీజు వేసింది. సుశీలకు పెళ్లీడు ఎలాగూ దాటిపోయింది. శాంత పెళ్లికి వచ్చింది. ఇక సుశీల పెళ్లి ప్రసక్తి లేదు. అందుకని శాంత పెళ్లి జరిగిపోతే, తనకి పుట్టే పిల్లలకి ఇక తిరుగుఉండదు. ఆయన ప్రాక్టీసు తగ్గినా, సుశీల ఆర్జన వేన్నీళ్ళకి చన్నీళ్లలాగ కలిసి వచ్చింది. అందువల్ల దీపముండగానేఇల్లు చక్కపెట్టుకోవాలి.

అందుకని – "శాంతకి సంబంధం చూడండీ" – అని భర్తతో పోరసాగింది అలివేలు. గోవిందరావుగారు ఎంతోసంతోషించారు. అనుకూలవతి అయిన భార్య, తన పిల్లల్ని అభిమానించే తల్లి దొరికినందుకు. "మరి సుశీల పెళ్ళి మాటేమిటి?" అని ఆయన అడగలేదు, ఆయన అడుగుతాడని ఆమె అనుకోనూ లేదు. అడగడానికేముందసలు? ఉదయించిన సూర్యుడు ముఖం కాల్చుకొని అస్తమించక ఏం చేస్తాడు? అస్తమిస్తాడు చూడండని వేరే చెప్పాలా?

ఆవిధంగా సుశీల పెళ్ళి ఆమె జీవితంలోంచీ, వాళ్ళ ఆలోచనల్లోంచీ జారిపోయింది. అందుకు సుశీలకూ నవ్వే వచ్చింది.

ఓశలవురోజు – కాలేజీ లేనిరోజున – శాంతని దగ్గర కూర్చోపెట్టుకొని "చెల్లీ! నీ పెళ్లికి సంబంధాలు చూస్తున్నారమ్మా నాన్నగారు" అంది సుశీల.

శాంత సిగ్గుపడింది. తర్వాత నవ్వింది. "పో అక్కా – నాకు పెళ్ళేవద్దు బాబూ" అంది.

ఆమాటకి నివ్వెరపోయింది సుశీల. చేతిలో దువ్వెన అక్కడ పడేసి – రివ్వున చెల్లెలిని తన వేపుకి తిప్పుకొని "ఈ మాట ఎవరితోనన్నా అన్నావా అమ్మా?" అనడగింది ఆత్రుతగా. శాంత తెల్లబోయింది "లేదు, ఏం?"

"ఎవరితో అనకూడదమ్మా. కొందరు అదృష్టవంతులికే "వొద్దు" అంటే "కావాలి" అని అర్థం. నీలాంటి అమ్మాయిలకి వద్దు అంటే వద్దనే అర్థం. తెలిసిందా?"

"మరేం ఫర్వాలేదక్కా, జరిగేదేదో జరుగుతుంది. ఇంతకూ మనకు కావలసినవాడు ఎక్కడో పుట్టే ఉంటాడు."

నవ్వింది సుశీల. చచ్చిపోయిన పాతబామ్మల ఆలోచనలు బ్రతికిఉన్న కొత్త అమ్మాయిలలో ప్రతిఫలిస్తున్నందుకు.

"అవునమ్మా పుట్టే ఉంటాడు. కాని, నేనే నీకోసం పుట్టానని చెప్పడు. పెళ్లయాక ఇతనే కాబోలు నాకోసం పుట్టాడని గుర్తుపట్టగలం. అంతకుముందే గుర్తు పట్టాలనుకోవడం, పట్టబోవడం ప్రమాదం తల్లీ! పుట్టినవాడు రాకపోతాడా అని ఎదురు చూడటమూ ప్రమాదమే. అప్పుడతను పుట్టి, పెరిగి తప్పుత్రోవంట ప్రయాణం చేసే ప్రమాదం ఉంది."

గొప్ప వేదాంతిలాగ - అమ్మనీ, బామ్మనీ, రాధనీ, నవ్వితే ముభావంగా కనిపించే పెళ్లికొడుకునీ, గోపాలన్నీ గుర్తు చేసుకుంటూ చెప్పింది సుశీల.

ఇదంతా వింటూంటే హఠాత్తుగా శాంతకి ఒక ఆలోచన తట్టింది.

"మరి నువ్వెందుకు పెళ్లి చేసుకోలేదక్కా!"

సుశీల తుళ్లిపడింది. దువ్వెన తీసుకొని జుత్తు చిక్కులు విప్పుతూ నవ్వింది.

"నీకు సలహా చెప్పడానికి సుశీలక్కయ్య ఉందమ్మా .... నాకు అప్పట్లో హెచ్చరించే వాళ్ళెవ్వరూ లేకపోయారు. అందుకు?" అందామనుకొంది.

కాని - "ఆఁ, నా పెళ్లికేం పోనిస్తూ" అంది ఎటువేపో చూస్తూ.

"ఈ జీవితానికింకా పెళ్లి జరిగే అదృష్టమా?" అన్న నైరాశ్యం, తన పెళ్లిమీద తనే శ్రద్ధ చూపలేదన్న పశ్చాత్తాపం ఆ మాటలలో ధ్వనించింది.

---